అబలల ఆర్తనాదాలు వికృతంగా వినిపించేది అక్కడే. పదవిహీనల పదమంజీరాలు విషాదంగా ప్రతిధ్వనించేది అక్కడే. మలిసంధ్య వెలుగుల్లో రాని చిరు నవ్వును బలవంతగా పెదాలపై పులుముకుని అసహజమైన అలంకరణలతో వీధి గుమ్మం ముందు నిలుచుని ఆశగా నల్లని కళ్ళలో చీకట్లోకి చూస్తూ తమ బతుకుల్లోకికూడా చీకటే కావాలని ఆహ్వానించుకునే ఈ దేశపు ఆడపడుచులు. కాలు జారటానికి అనుక్షణం సిద్ధపడుతూ, నైతికంగా దిగజారిపోయి, స్త్రీ సహజమైన సిగ్గు చంపేసుకుని జీవచ్ఛవంగా మారి కాలే కడుపు కోసం కానిపని చేస్తున్న నిజమైన అబల.

కులట, వేశ్య, పతిత! ఏ పేరుతో పిలవబడితేనేం? ఈ సమాజంచేత వంచింపబడి వోడిపోయిన స్త్రీ!

"ఏ ఆప్యాయతకు నోచుకోని యాంత్రిక జీవితం. ఏ కారణాల చేత ఈ రొంపిలోకి దిగినా ఇందులోంచి తప్పించుకోవటం మాత్రం సాధ్యం కాదు. ఒక వేళ తప్పించుకున్నా బయటి ప్రపంచంతో రాజీ పడలేనేమో?

"నిస్సారంగా, నిర్లిప్తంగా గడుస్తున్న నా జీవితంలో—

"అమృతకలశం రాజు. వడలిన నా మనస్సును సేద తీర్చగల స్నేహపాత్రుడు.

"రోజూ చీకటి పడే వేళకు వచ్చేవాడు. అందరిలా రాగానే దేహేచ్ఛ వాంఛల కోసం తహతహ లాడేవాడు కాదు. ఆ కళ్ళల్లో నాకు కసి, లాలస కనిపించేవి కావు. ఆరాధన, లాలన వ్యక్తం చేయటానికి ఆత్రత పడుతున్నట్టుండే ఆ కళ్ళను చూసేసరికి నేను మైమరిచి పోయేదాన్ని.




**-యెలిశెట్టి శంకరరావు**

చీకటి, ఆకలి, నిస్సహాయత, కసి, నిర్లక్ష్యం, మోసం, ఆర్తనాదం, కారు చీకటి—వీటి కలగలుపే ఆ జీవితాలు. ఆ బతుకుల్లో—

రేణుక:

"నేనొక గడ్డి గులాబీని. నిజానికి గడ్డి గులాబీ అందంగానే ఉంటుంది కాని, ఏ మాత్రం సువాసన లేనిది. నిర్దాక్షిణ్యంగా కరకు పాదాల కింద నలిగి వాడిపోయేది. గడ్డిగులాబీ. నా జీవితంకూడా అలాంటిదే.

"చీకటి బతుకు. ఆశలు అణగారిపోగా ఎందుకు బ్రతుకుతున్నానో నాకే తెలియదు. గానుగెద్దుల్లా జీవితాల్ని నిస్సారంగా సాగించటం, కొవ్వొత్తి వెలుగుల్ని చూసి భ్రమపడి ఆ వెలుగుల్లో తమను తామే దహింప చేసుకునే శలభాల్లాంటివే మా జీవితాలు. ఎందరో దౌర్భాగ్యురాళ్ళు! సంఘం విసిరేసిన పురి విస్తరాకులు. ఇలాంటి వేలాది జీవితాల్లో నాదొకటి.

"చిన్నపిల్లవాడులా నా ఒళ్ళో తల పెట్టుకుని మారాం చేసేవాడు రాజు. తన బిగి కౌగిలిలో నన్ను ఉక్కిరి బిక్కిరి చేసేవాడు. ఏవేవో ఊసులతో, అల్లరితో నిమిషాలు, గంటలు క్షణాల్లా దొర్లిపోయేవి.

"క్రమంగా రాజు నాకు మానసికంగా, శారీరకంగా సన్నిహితు డయిపోయాడు. అతను రావడం ఒక గంట ఆలస్యమయితే అదోలా ఉండేది నాకు. ఒక రోజు—

'రేణూ! నిన్ను పెళ్ళి చేసుకుంటాను. నాతో వచ్చేస్తావా?' రాజు ప్రశ్న విని త్రుళ్ళి పడ్డాను. భయం, ఆశ అన్నీ నన్ను వెల్లువలా ముంచెత్తాయి.

'ఈ సంఘం పిచ్చికుక్కలా మమ్మల్ని తరిమి తరిమి కొట్టదా?' చేదు ప్రశ్న నాలో అంకురించింది. అదే రాజుతో మొర పెట్టుకున్నాను.

"చిన్నగా నవ్వేసి, 'ఈ సమాజం అద్దం లాంటిది. రేణూ! మనం నవ్వితే నవ్వుతుంది. ఏడిస్తే తనూ ఏడుస్తుంది' అన్నాడు. రాజు మాధానం విని అయోమయంగా తన మొహంలోకి చూస్తూ ఉండి పోయాను. రాజు కళ్ళలో నా సమాధానం కోసం ఆత్రత తప్ప మరేమీ లేదు. అమాయకంగా ఉన్న ఆ మొహంలోకి చూస్తూ అంగీకార సూచకంగా తల పూపటం తప్ప మరేమీ మాట్లాడలేక పోయాను.

"తన బలమైన కౌగిలిలోకి నన్ను లాక్కుని అదురుతున్న నా పెదవుల్ని తన అధీనంలోకి తీసుకున్నాడు రాజు. మత్తులో ఎంతసేపు ఉన్నామో తెలియదు. కళ్ళు తెరిచేసరికి నవ్వుతూ నా కురులు సవరిస్తున్నాడు రాజు.

"జీవం లేని కాగితాలు జేబులు మారాయి. నే నా పంజరం నుంచి బయట పడ్డాను. గుడ్డి వెలుతురును వదిలేసి ఆశల అంధకారంలో భవిష్యత్తు వెదుక్కుంటూ రాజుతో బాటు ముందుకు నడిచాను.

* * * *

రాజు:

"తలంతా భారంగా, విసుగ్గా, చికాగ్గా ఉంది.

"కసి! ఎవరి మీదో?

"అసహ్యం—నా మీద నాకే!

"రేణు వ్రాసిన ఉత్తరం ఉండలా చేతిలో నలుగుతూంది. విప్పి మళ్ళీ చదివాను.

'ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉంది. ఎందుకో తెలుసా?

'ఇన్నాళ్ళూ ఈ సంఘంలో నేనే హీనంగా బ్రతుకుతున్నానని కుమిలి పోయేదాన్ని. నా కంటే హీనంగా నీ లాంటి వాళ్ళు బ్రతుకుతున్నారని తెలిసి ఈ రోజు చెప్పలేనంత ఆనందంగా ఉంది.

'రాజా! నాకు తెలిసి నంతవరకు నువ్వు విద్యావంతుడివి. ఈ నీచమైన మార్గాన్ని వదిలేసి మరో ఋజుమార్గంలో బ్రతకడానికి ప్రయత్నించు.

'నన్ను మామూలు పంజరంలోంచి బంగారు పంజరంలోకి మార్చి నందుకు నీకు నా కృతజ్ఞతలు, రాజా! చివరగా చిన్న మాట. మరే అమ్మాయి జీవితంతోనూ ఇంత క్రూరంగా ఆడుకోకు. నేను పతివిహీనను కావచ్చు. కానీ, నాకుకూడా కలలు కనే కళ్ళు, మధురమైన వూహలతో మురిసిపోయే మనసు ఉన్నాయి. ఆ కలల్ని, వూహల్ని సృష్టించి వాటిని మొగ్గలోనే త్రుంచేసే అధికారం నీకు లేదు. నీ ద్రోహానికి ఫలితంగా నా కన్నీళ్ళు నీ పాలిట' శాపం అవుతాయి. అప్పుడు నీ కళ్ళలో నీళ్ళు ఇంకిపోయేదాకా నువ్వు కుళ్ళి కుళ్ళి ఏడుస్తావు.

సెలవు.

రేణుక.'

"ఉత్తరం మడిచేసి పక్కకు విసిరేశాను. మనసంతా ఏదో బాధగా ఉంది. గుండెలో ఎవరో సూదులతో గుచ్చుతున్నట్లవుతూంది.

'నీ ద్రోహానికి ఫలితంగా నా కన్నీళ్ళు నీ పాలిట శాపం అవుతాయి. అప్పుడు కళ్ళలో నీళ్ళు ఇంకిపోయేదాకా నువ్వు కుళ్ళి కుళ్ళి ఏడుస్తావు.'

"రేణు మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

"అప్రయత్నంగా ఎందుకో నవ్వు వచ్చింది.

"జీవం లేని నవ్వు!

"దీనంగా హీనమైన వెర్రినవ్వు!

"ఏడుస్తాను, రేణూ! తప్పకుండా ఏడుస్తాను! మమ్మల్ని నరకయాతన పెట్టి తాగితాగి ఆ తాగుడికే బలి అయిపోయిన నాన్నను చూసి గుండె లవిసేలా ఏడిచాను. పాతికేళ్ళు పైబడుతున్న తనకు నేను పెళ్ళి చేయలేనని తెలిసి వయసు వాడికి తట్టుకోలేకపోయిన అక్కయ్య ఒక మగవాణ్ణి నమ్మితాను జీవితాన్ని గెలవలేదని, జీవితమే తనను ఓడించిందని తెలుసుకుని ఆత్మహత్య చేసుకున్నప్పుడు కుళ్ళి కుళ్ళి ఏడిచాను. 'అన్నయ్యా! ఆకలి' అని నా చిన్నారి చెల్లెమ్మ దీనంగా అడుగుతూ, నా చేత కాని తనం వల్ల ఆ ఆకలికే బలి అయి పోయినప్పుడు దిశ దిశలూ పిక్కటిల్లేలా ఆ భగవంతుడనే వాడు ఒకడు ఉంటే వాడికి వినిపించేటంత గట్టిగా ఏడిచాను.

"నాకు పట్టెడన్నం పెట్టలేని నా డిగ్రీని చూసుకుని హాయిగా మన స్ఫూర్తిగా ఏడిచాను.



పుష్ప కన్య ఫోటో — సుధాకర్ యడ్లపల్లి (జంషెడ్ పూర్)

"రేణూ! అన్నింటినీ మించిన ఆకలి నన్ను లోబరుచుకుని నా వ్యక్తిత్వం చేత తనకు దాసోహ మనిపించుకుంది. నేను ఘోరంగా ఓడిపోయాను, రేణూ! ఒక్కటి మాత్రం నిజం. నేను నిన్ను మోసం చేయాలనుకోలేదు. నువ్వు ఈ సంఘం పారేసుకున్న ఆణిముత్యానివి. నన్ను జీవితం మోసం చేస్తే ఆ వక్ర మార్గంలో పడి నిన్ను నేను మోసం చేశాను. చెప్పు, రేణూ! ఇది పాపమా? ఇంకా నా కరుడు గట్టిన హృదయం నీ శాపం ఫలితంగా కన్నీళ్ళుగా మారి ప్రవహించ గలదా?

"నా అంతరంగంలో ఘోష రేణు కేలా తెలుస్తుంది?"

* * *

రచయిత:

"చీకటి, ఆకలి, నిస్సహాయత, కసి, నిర్లక్ష్యం, మోసం, ఆర్తనాదం... కారు చీకటి—చీటి కలగలుపే ఆ జీవితాలు. ఆ బ్రతుకుల్లో కాగడా వేసి వెదికినా... వెలుగు కనిపించదు. మనుషుల్ని పశువు వృత్తికో, తార్పుడు వృత్తికో అంతకంటే... నీచమైన మరేదైనా దిగజార్చే మహత్తరమైన శక్తి ఒకటి ఉంది. అదే ఆకలి. అందుకే ఆకలీ! నీకు జోహారు!"

*